ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

అయిజ, నవంబర్ 18 : మండలంలోని ఉత్తనూర్ గ్రామంలో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా ఉదయం స్వామికి సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్ప స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జములమ్మ, పరశురాముల విగ్రహాల ఊరేగింపు

జూలేకల్‌లో జములమ్మ, పరశురాముని విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

వడ్డేపల్లి, నవంబర్ 18 : మండలంలోని జూలేకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శనివారం జమ్ములమ్మ, పరశురాముడి విగ్రహాలను గ్రామస్థులు మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను జలదివాసం చేశారు. వేదపండితుల మంత్రోక్షరణలతో జరిగిన హోమ కార్యక్రమాల్లో నరసింహారావు, పద్మజ, సీతారామారావు, రూపశ్రీ దంపతులు పాల్గొన్నారు. ఆదివారం రోజు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తారని భక్తులు పాల్గొనాలని గ్రామ పెద్దలు, ప్రజలు తెలిపారు.

బీచుపల్లిలో కార్తీక పూజలు

ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఇటిక్యాల, నవంబర్ 18 : కార్తీక మాసం మొదటి శనివారం బీచుపల్లిలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పావన కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించిన అనంతరం భక్తులు పుష్కరఘాట్ చెంత గల శివాలయం ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక దీపాలను వెలింగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ పర్యవేక్షించారు

శ్రీశైలంలో భక్తికీర్తనల ఆలాపన

అయిజ, నవంబర్ 18 :ప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి ఆలయంలో మున్సిపాలిటీ పరిధిలోని పద్దిపురం గ్రామానికి చెందిన మారుతి భజన మండలి బృందం భక్తి కీర్తనలు ఆలపించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారుల సూచనల మేరకు నిర్వహించిన సప్తాహ భక్తికీర్తనల ఆలాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భక్తి కీర్తనలు ఆలపించినట్లు హర్మోనిస్ట్ గోవింద్‌గౌడ్ తెలిపారు. భక్తి కీర్తనలు భక్తులను అలరించడంతో ఆలయ అధికారులు సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో రాముడు, రవి, ఖాజన్నగౌడ్, హరినాథ్‌రెడ్డి, రామచంద్ర, రామంజి, విశ్వనాథరెడ్డి, గంగన్న, కర్రెబసన్న గౌడ్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తికీర్తనలకు హాజరైన భజన మండలి బృందం

గులాబీ జన జాతర

- పదేండ్ల ప్రగతి, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న నేతలు
- ప్రతిఒక్కరినీ పలకరిస్తూ ముందుకు సాగుతున్న శ్రేణులు
- గులాబీ పార్టీకి అడుగడుగునా జన నీరాజనం
- అయిజలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి పక్షాన ఇంటింటి ప్రచారం

అయిజ, నవంబర్ 18 : అయిజ పట్టణంలో గులాబీ జనజాతర కనిపిస్తోంది. శనివారం పట్టణంలోని 1, 11, 12 వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఇంటింటి ప్రచారం జోరుగా చేపట్టారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు పక్షాన బీఆర్ఎస్ శ్రేణులు, నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పదేండ్లలో అమలు సంక్షేమ పథకాలు, ప్రగతిని వివరిస్తున్నారు. 2023లో ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ.. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగుతున్నారు. అలంపూర్‌లో బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన అభివృద్ధిని చూసి అభ్యర్థిని ఆశీర్వదించాలని నేతలు ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ ప్రగతిబాటలో పయనిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్‌కు అండగా నిలిచి మూడోసారి హ్యాట్రిక్ సాధించేలా కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ప్రజలు బీఆర్ఎస్‌కు నీరాజనం పలికారు. కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న గులాబీ దండు

ప్రజాఆశీర్వాద సభకు తరలిరండి..

అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌తో నిర్వహించనున్న అలంపూర్ ప్రజాఆశీర్వాద సభకు పట్టణ, మండలం నుంచి ప్రజా ప్రతినిధులతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వలసలు లేవు పనులు ఫుల్

వడ్డేపల్లి, నవంబర్ 18 : వడ్డేపల్లి మున్సిపాలిటీలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కరుణ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొన్ని వార్డుల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారం చేస్తూ ముందుకు వెళ్తుండగా భవననిర్మాణం చేస్తున్న చోట ఆగిపోయి కాసేపు భవన నిర్మాణ కార్మికులు, కూలీలతో ముచ్చటించారు. గతంలో కర్ణాటక, హైదరాబాద్, గుంటూరు, ఆంధ్ర తదితర దూరప్రాంతాలకు వలసలు వెళ్లి పనులు చేసుకునేవాళ్లమని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాకు ఇక్కడే పనులు పుష్కలంగా దొరకున్నాయని వలసలు లేవని వారు ఆనందంగా చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరింది. ప్రచారంలో నాయకులు కౌన్సిలర్లు ధనలక్ష్మి, లలితమ్మ, నాయకులు శ్రీనివాస చౌదరి, వడ్డేపల్లి సూరి, తోట రవి, మాదన్న, రంగస్వామి పాల్గొన్నారు

బీఆర్ఎస్‌తోనే బతుకులు బాగుపడతాయ్

అలంపూర్, నవంబర్ 18 : బీఆర్ఎస్ పార్టీతో తెలంగాణ ప్రాంత ప్రజలు బాగుపడతాయ్ అని బీఆర్ఎస్ యువజనప నాయకుడు వల్లూరు కిశోర్ అన్నారు.శనివారం ఉండవల్లి గ్రామంలో ఎమ్మెల్యే అబ్యర్థి తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విదంగా కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు.ముచ్చటగా మూడో సారి కేసీఆర్‌కు పట్టం కడితే తెలంగాణ రాష్ట్రం దేశంలో నెంబర్ వన్ గా మారుతుందన్నారు.అదే విదంగా అలంపూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అబ్యర్థి విజయుడి కారు గుర్తుపై ఓటు వేసి భారి మెజార్టీతో గెలిపించాలని కోరారు.అంతకు ముందుకు వారికి గ్రామస్తులు స్వాగతం పలికారు.

ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

ప్రచారం నిర్వహిస్తున్న వల్లూరు కిశోర్ , నేతలు

శాంతినగర్‌లో ఇంటినిర్మాణ పనులు చేస్తున్న చైర్‌పర్సన్ కరుణ

రెండోదశ ర్యాండమైజేషన్ పూర్తి

గద్వాల, నవంబర్ 18 : శాసనసభ ఎన్నికలకు సంబంధించి బీయూ, సీయూ, వీవీప్యాట్‌ల రెండోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు వసంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఐడీవోసీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలో ఉన్న కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు రెండో ర్యాండమైజేషన్ నిర్వహించి ప్రక్రియను స్క్రీన్ ద్వారా చూయించినట్లు చెప్పారు. జిల్లాలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు కేటాయిస్తామని, పూర్తైన కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్‌ల జాబితా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. గద్వాల నియోజకవర్గానికి సంబంధించి 303 పోలింగ్‌కేంద్రాలకు 20 మంది అభ్యర్థులు ఉండగా ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రెండుబీయూలు ఇచ్చామన్నారు. బ్యాలెట్ యూనిట్లు 378, కంట్రోల్ యూనిట్లు 378, వీవీప్యాట్‌లు 40శాతం రిజర్వ్‌తో 424 కేటాయించినట్లు చెప్పారు. అలంపూర్ నియోజకవర్గానికి 290 పోలింగ్ స్టేషన్లకు 13 మంది అభ్యర్థులు ఉండడంతో 362 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లతో పాటు 406 వీవీ ప్యాట్‌లు సీరియల్ నెంబర్ ప్రకారం కేటాయించామన్నారు. ప్రతి సెక్టోరియల్ అధికారికి పదిపోలింగ్ స్టేషన్లు ఉంటాయని, పోలింగ్ రోజు బ్యాలెట్ యూనిట్ల ద్వారా ఓటు వినియోగంపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాసులు, అపూర్వచౌహాన్, ఆర్డీవో చంద్రకళ , వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు వసంత్‌కుమార్

ఆర్డీఎస్ ఆనకట్టకు స్థిరంగా వరద

ఆర్డీఎస్ ఆనకట్టపై నుంచి పారుతున్న వరద

అయిజ, నవంబర్ 18 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతోంది. శనివారం ఆర్డీఎస్ ఆనకట్టకు 4,329 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 3,800 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 529 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.6 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వస్తున్న నీటితో ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు చెరువులను నింపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పంప్ ద్వారా నీటి విడుదల నిరవధికంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు.

టీబీ డ్యాంకు తగ్గుతున్న వరద ..

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వరద తగ్గుతున్నది. ఇన్‌ఫ్లో 370 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 8,716 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 22.667 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1600.87 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.